క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పేరంపేట రోడ్డు ఈ–సేవా కేంద్రం వద్ద శ్రీసీతారామ దేవస్థానం వద్ద పెద్ద రామాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మామిడి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డి సూరిబాబు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ బుంగ సతీష్, ప్రధాన కార్యదర్శి సంకు సురేష్ బాబు, సహాయ కార్యదర్శి జోగి అనిల్, కోశాధికారి గడ్డి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్యామలపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి చాట్ల వెంకటేశ్వరరావు, దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెండి చీర తయారీకి భక్తుల విరాళం



నూకాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మఆలయంలో ముక్కోటి ఏకాదశి, శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కల్యాణ కళా వేదిక వద్ద ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, సాయం సంధ్యాహారతి పూజలు అర్చకులు నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి 71వ చండీ హోమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం స్థానిక మాటూరి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు 25 తులాల వెండిని, సలుగుల రమణ కుటుంబ సభ్యులు ఐదు తులాల వెండి సమర్పించారని తెలిపారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీరామ్ నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం వద్ద శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ముగ్గుల పోటీ కార్యక్రమం నిర్వహించారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 85 మందికి పైగా యువతులు, మహిళలు పాల్గొని సందేశాత్మక, ఆకర్షణీయమైన సాంప్రదాయ ముగ్గులను వేశారు. వీరికి సింగుదాసు సత్యనారాయణ, సింగుదాసు నాగేశ్వరరావు సోదరులు 25 వేల రూపాయల విలువైన బహుమతులను అందజేశారు. ప్రత్యేక బహుమతులను వాసవీ గ్రాఫిక్స్ సుధాకర్, ఫకీర్ బాబు అందజేశారు. సంక్రాంతి వేడుకల నేపథ్యంలో జూద క్రీడలకు ఆస్కారం లేకుండా ఇటువంటి సాంప్రదాయ పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని ప్రజా ప్రతినిధులు పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పోలవరం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులు దరి చేరవని సర్పంచ్ మైగాపుల విజయదుర్గ అన్నారు. కొత్తపట్టిసీమలో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలకు కారణమవుతాయన్నారు. అలాగే చెత్తా, చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యాన్ని పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల నివారణకుగాను ఆయిల్‌బాల్స్, టిమిపాస్ మందులను పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో బి.నాగేశ్వరరావు, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి చవలం విజయలక్ష్మి, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల ఘటన బాధాకరం

జంగారెడ్డిగూడెం: తిరుమలలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించటం చాలా బాధాకరమని, వారికి పట్టణ బీజేపీ నుంచి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు బీజేపీ జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని, హైందవ శంఖారావం ఎనిమిది లక్షల మందితో జరిగితే ఒక్క సంఘటన కూడా జరగలేదన్నారు. కానీ కేవలం 70 వేల మందిని అదుపు చేయలేకపోవడం అధికారుల అలసత్వానికి నిదర్శనమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రబీకైనా పెట్టుబడి సాయం అందేనా?

- కచ్చితమైన ప్రకటన చేయని కూటమి ప్రభుత్వం
- అయోమయంలో రైతన్నలు.. వ్యవసాయ పనుల్లో నిమగ్నం



మెట్టలో రబీ వరి పంట వేయడానికి ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం



మెట్ట ప్రాంతంలో నిమ్మతోటలో రైతులు పండిస్తున్న వేరుశనగ పంట

చింతలపూడి: మెట్ట రైతులు ప్రస్తుతం రబీ సాగులో నిమగ్నమయ్యారు. గత ఏడాది ఖరీఫ్‌లో కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందిస్తుందని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించక తప్పలేదు. ఖరీఫ్ మాసూళ్లు పూర్తవ్వడంతో పండిన ధాన్యాన్ని విక్రయించి వచ్చిన సొమ్ముతో అప్పులు తీర్చుకుని మిగిలిన సొమ్ము రబీకి పెట్టుబడులు పెట్టుకుంటున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లో 8,228 ఎకరాల్లో రబీ వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. వరి కాకుండా 24,152 ఎకరాల్లో మొక్కజొన్న, 2,826 ఎకరాల్లో పొగాకు, 811 ఎకరాల్లో వేరు శనగ పండించడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. సబ్ డివిజన్‌లో ఇప్పటికే దాదాపు నాట్లు వేయడం తుది దశకు చేరుకుంది. మరో వారం, 15 రోజుల్లో నాట్లు వేయడం పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

నేడు రైతాంగం తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటను పండించడానికి విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారు. ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు నశించి సమతుల్యత లోపిస్తుంది. ముందెన్నడూ లేని విధంగా ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటల్లో కనిపిస్తున్నాయి. ఈ పోషకాలు లోపించినప్పుడు సాగులో మిగతా యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటించకపోయినా దిగుబడులు తగ్గుతాయి. వీటిని అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మేలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగకుమార్ సూచిస్తున్నారు. చింతలపూడి సబ్ డివిజన్‌లో ప్రతి ఏటా రబీ సీజన్‌లో సుమారు 8,200 ఎకరాల్లో వరి, 27,700 ఎకరాల్లో మొక్కజొన్న, 700 ఎకరాల్లో వేరు శనగ, 3,341 ఎకరాల్లో పొగాకు పంటలను రైతులు సాగు చేస్తుంటారు. ఇవి కాక మిర్చి, పొద్దు తిరుగుడు, చెరకు, కూరగాయల పంటలు పండిస్తుంటారు.

వేరుశనగకు జిప్సం అవసరం

వేరుశనగ పంటలో అధిక దిగుబడులకు జిప్సంను పూత దశలో వేసుకుని భూముల్లో కలియ బెట్టడం వల్ల వేరుశనగ ఊడలు జిప్సంలోని కాల్షియం, గంధకాన్ని తీసుకుని అధిక దిగుబడులు వస్తాయి. పూత సమయంలో ఎకరాకు 200 కిలోల చొప్పున భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు మొక్కలకు దగ్గరగా వేసుకోవాలి. దీంతో భూమి గుల్లబారి నీరు ఇంకే స్వభావం పెరిగి మొక్కల వేర్లు బాగా వద్ది చెందుతాయి.

ఆరుతడి పంటలు మేలు



మెట్టలో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవడం మేలు. మార్చి నెల వచ్చే సరికి చెరువుల్లో నీళ్లు తగ్గిపోయి సాగు నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. త్రాగు నీటితో పాటు, పశువులకు కూడ నీరు దొరక్క ఇబ్బందులు కలుగుతాయి. ఈ పరిస్థితుల్లో ఆరుతడి పంటలు వేసుకోవడం వల్ల నష్టం ఉండదు. రైతులు వరికి బదులు మొక్కజొన్న, వేరుశనగ తో పాటు నువ్వులు, అపరాల వంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

–బి.నాగకుమార్, సహాయ సంచాలకులు

ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుబడిన నిందితులతో అధికారులు

చింతలపూడి: స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామ శివారులో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చింతలపూడి గ్రామానికి చెందిన షేక్ ఆదం, కొత్తా అప్పారావు ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల సారాను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా చింతలపూడి మండలం, కామవరపుకోట మండలాల్లో పాత సారా కేసుల్లో నిందితులైన ఆరుగురిని చింతలపూడి, కామవరపుకోట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ల ముందు హాజరు పరిచి బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌పీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కామవరపుకోట: మొగల్తూరు మండలం కొత్తపాలెంలో గురువారం రాత్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మండల టౌన్ కన్వీనర్ నానాది సాగర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రాజకీయ కక్షలు పెంచేందుకు విగ్రహాన్ని ధ్వంసం చేయటం హేయమైన చర్య అన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసి రెచ్చగొట్టడం మంచిది కాదని హితవు పలికారు.

నిలిచిపోయిన పిసా ఎన్నికలు



కోయరాజమండ్రిలో ఎన్నికల్లో ఇరు వర్గాల వాదనలు వింటున్న ఎంపీడీఓ జ్యోతి

బుట్టాయగూడెం: మండలంలోని కోయరాజమండ్రిలో శుక్రవారం నిర్వహించిన పిసా(పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్ యాక్ట్) ఎన్నిక గందరగోళం మధ్య మళ్లీ నిలిచిపోయింది. కోయరాజమండ్రి పీసా ఎన్నికలకు సంబంధించి అధికారులు ఈ నెల ఎనిమిదో తేదీన అధికారులు పిసా ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఆ రోజు కోరం పూర్తికాకపోవడం వలన ఎన్నికలను అధికారి వాయిదా చేసినట్లు ప్రకటించారు. అయితే తిరిగి మళ్లీ శుక్రవారం నిర్వహించగా అక్కడికి చేరుకున్న గిరిజన, లంబాడీ తెగకు చెందిన వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కోయరాజమండ్రి, రాయగూడెం, చంద్రాయిగూడెం, మెట్టగూడెం గ్రామాలకు సంబంధించి సుమారు 688 మంది ఓటర్లు ఉన్నారు. అయితే శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో 290 మంది హాజరయ్యారు. అయితే ఈ ఎన్నికలను జరగనివ్వకుండా గిరిజనులు అడ్డుపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఎంపీడీఓ కె.జ్యోతి అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎస్టీలు ఎవరైనా పోటీ చేసే హక్కు ఉందని చెప్పారు. తమకు ఆ విధంగానే ఆదేశాలు వచ్చాయన్నారు. దీనికి గిరిజనులు ఒప్పుకోకపోగా ఎన్నికలను బహిష్కరిస్తున్నామని రాత పూర్వకంగా రాసి ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి తేదీని ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రవ్వా చంద్రకళ, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, కార్యదర్శి పద్మజ, వీఆర్‌ఓ ఆశ, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

పలుచోట్ల బరులు ధ్వంసం



టి.నరసాపురం: జూదాల నిషేధాజ్ఞల బ్యానర్‌ను ఏర్పాటు చేసిన అధికారులు



చింతలపూడి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



బుట్టాయగూడెం: కోడి పందేల నిషేధంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్



కొయ్యలగూడెం: రాజవరంలో కోడి పందేలకు సిద్ధం చేసిన బరులను ధ్వంసం చేయిస్తున్న తహసీల్దార్, ఎస్సై

జంగారెడ్డిగూడెం: కోడి పందేల బరులు ఏర్పాటు చేసిన, అందుకు అవకాశం కల్పించిన వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర హెచ్చరించారు. మండలంలోని లక్కవరం గ్రామంలో కోడి పందేల నిర్వహణకు సిద్ధం చేసిన బరిని సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. జూద క్రీడలపై ఎల్లప్పుడూ నిఘా ఉంచుతామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే గేమింగ్ యాక్ట్, యానిమల్ యాక్ట్ తదితర చట్టాల పరిధిలో శిక్షిస్తామని హెచ్చరించారు.

అసాంఘిక కార్యకలాపాలు నిషేధం

బుట్టాయగూడెం: సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కోడి పందేలు, జూదం, పేకాట నిషేధంపై పోలీసు, వీఆర్‌ఓ, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. జ్యోతి, ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

బరులు ధ్వంసం

టి.నరసాపురం: కోడి పందేలు, జూదక్రీడలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని టి.నరసాపురం తహసీల్దార్ టి.సాయిబాబ, ఎస్సై ఎం.జయబాబు హెచ్చరించారు. శుక్రవారం టి.నరసాపురం గ్రామ శివారులో కోడి పందేల బరులను రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ధ్వంసం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

జూదాలతో జీవితాలు చిత్తు

ద్వారకాతిరుమల: సంక్రాంతి పండుగ పేరుతో జూదాలు ఆడి జీవితాలను చిత్తు చేసుకోవద్దని స్థానిక పంచాయితీ కార్యదర్శి జీటీవీ శ్రీనివాస్, గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు లక్ష్మీ సుజన, మల్లేశ్వరి, వీఆర్వో భవానిలు సూచించారు. తహసీల్దార్ జేవీ సుబ్బారావు, ఎస్సై టి.సుధీర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం జూదాలు ఆడటం వల్ల జరిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పురుషోత్తం, సాదిక్, వెటర్నరి అసిస్టెంట్ రాజశేఖర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మిత, పంచాయితీ సిబ్బంది నరేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

చింతలపూడి: మండలంలో కోడి పందేల నిషేధంపై అవగాహన ర్యాలీని ఎస్సై కుటుంబరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రజలు కోడి పందేల నిషేధానికి సహకరించాలని కోరారు.

కమిటీల ఏర్పాటు

కుక్కునూరు: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు నిర్వహించకుండా తగిన చర్యలు చేపట్టినట్టు కుక్కునూరు తహసీల్దార్ కె.రమేష్‌బాబు చెప్పారు. శుక్రవారం కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓ పీఎస్ఎన్ నరసింహారావుతో కలిసి కోడి పందేల నిషేధానికి వివిధ శాఖల సిబ్బందితో కలిసి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు.

కోడిపందాల బరులు ధ్వంసం

కొయ్యలగూడెం: రాజవరంలో కోడి పందేల బరులకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని అధికారులు ధ్వంసం చేశారు. తహసీల్దార్ కె.చెల్లన్న దొర, ఎస్సై వి.చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి గ్రామ సమీపంలోని చెరువు గర్భంలో నిర్మిస్తున్న శిబిరాన్ని ధ్వంసం చేయించారు. ఏకంగా మినీ స్టేడియంగా పందాల రాయుళ్లు షెడ్డును నిర్మిస్తుండడం గమనార్హం.

ఉత్తర ద్వార దర్శనంలో ప్రముఖులు



ఉత్తర ద్వారం వద్ద శ్రీవారిని దర్శించుకుంటున్న రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

ద్వారకాతిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులు శుక్రవారం శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం, కొవ్వూరు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకటరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఏలూరు మేయర్ నూర్జహాన్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, విజయవాడ సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు తదితరులు వేరువేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఎంపీ పురందేశ్వరికి ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

పుష్పాలంకరణ దాతకు వేద ఆశీర్వచనం

శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం పూల అలంకరణ దాతను ఆలయ అధికారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అలాగే ఆలయ ఆవరణలో పండితులు వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ముందుగా రాజమండ్రికి చెందిన దాత డాక్టర్ పి.నవీన్ కుమార్ కుటుంబ సమేతంగా ఉత్తర ద్వారం వద్ద స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డాక్టర్ నవీన్ కుమార్ గత పదేళ్లుగా ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించిన పూల అలంకరణలను సొంత ఖర్చులతో చేస్తున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ఈ అలంకరణలకు సుమారు రూ.3.25 లక్షల ఖర్చు అవుతుందన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,25,000 లను విరాళంగా అందజేశారు. గన్నవరం మండలం వేమండకు చెందిన కామినేని నాగరాజు ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

ఘనంగా అధ్యయనోత్సవాల ప్రారంభం

శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు శుక్రవారం సాయంత్రం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుగా పది రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఇక్కడ సాంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఉభయ దేవేరులతో శ్రీవారిని తొళక్కవాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. నవకలశ స్నపన, అభిషేకాలు, తిరుమంజనాలు చేసి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. అనంతరం పురవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి



కొయ్యలగూడెం: మదన గోపాలస్వామి ఆలయంలో హారతులు సమర్పిస్తున్న మహిళలు



టి.నరసాపురం: కరెన్సీతో అలంకరించిన సీతారామ లక్ష్మణులు

కొయ్యలగూడెం: వైకుంఠ ఏకాదశి శుక్రవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వైష్ణవ ఆలయాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు స్వామి వారు వేవేరులతో దర్శనమిచ్చారు. టెంపుల్స్ సెంటర్‌లో శ్రీరుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో మహిళలు ముక్కోటికి ఆహ్వానం పలుకుతూ దీపాలంకరణతో శ్రీమన్నారాయణుడిని సేవించారు. ఉదయం ఐదు గంటలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కన్నాపురం, రాజవరం, బయన్నగూడెంలలోని సీతారామాలయాలు శ్రీకృష్ణ మందిరాల్లో ముక్కోటికి ప్రత్యేక పూజలు చేశారు.

నోట్ల కట్టల అలంకరణలో స్వామివారు

టి.నరసాపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ప్రధానంగా బొర్రంపాలెంలోని ముక్కోటి రామాలయం వద్ద స్వామి వారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అఖండ అన్న సమారాధన నిర్వహించారు.

గోకుల తిరుమల పారిజాత గిరిలో ముక్కోటి

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈరోజు వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో వేకువ జామున ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేసి, కార్యనిర్వహణ అధికారి మాణికల రాంబాబు పర్యవేక్షించారు.

సమ్మె కాలపు హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద బి.బాలరాజు అధ్యక్షతన కార్మికులు ఒక రోజు రిలే దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ టౌన్ కార్యదర్శి షేక్ సుభాషిణి, మున్సిపల్ పారిశుధ్య కార్మికుల అధ్యక్షుడు రేలంగి నాగరాజు మాట్లాడుతూ 16 రోజుల సమ్మె ఫలితంగా ఇచ్చిన హామీల అమలుకు వెంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ, జీవో 36 అమలు చేయాలన్నారు. రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, తట్టలు పారలు, పని ముట్లు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే మీ డిమాండ్లు అమలు చేస్తామన్నారు. కాని నేడు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుల కార్యదర్శి గున్నే లక్ష్మణ్, వెంకటేశు, ప్రసాద్, పెంటయ్య, వేల్పుల రాజు, సత్యవతి, మంగ పాల్గొన్నారు.

చదివిన బడికి చేయూత



జెడ్పీ బాలుర హైస్కూల్‌కు ప్రింటర్, మానిటర్‌ను అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కన్న తల్లి, పెరిగిన ఊరు, చదివిన బడి రుణాన్ని కొంతైనా తీర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కేఎస్ లోవకుమారి అన్నారు. పూర్వ విద్యార్థులు తల్లాడి జగదీష్ బాబు, పమ్మిడి అనిల్, కట్టా శ్రీనివాసరావు, కూరగంటి ఫణి, సోమన నాగేశ్వరరావు, సత్యలత, పద్మ, విజయశ్రీ, అరుణ జ్యోతి, 1992–97 బ్యాచ్‌ల విద్యార్థులు రూ.20 వేల విలువ చేసే కంప్యూటర్ ప్రింటర్‌ను శుక్రవారం హెచ్ఎంకు అందేశారు. గత నెల ఉద్యోగ విరమణ చేసిన స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయులు జి.మధుసూదనరావు కంప్యూటర్ మానిటర్‌ను బహూకరించారు. ఉపాధ్యాయులు ఎం.విజయ ప్రకాష్, చిలుకూరి సుధాకర్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ తల్లాడి జగదీష్ పాల్గొన్నారు.